క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

మంగపేట: మండలంలో ఐదు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గోదారి రవికుమార్ అన్నారు. ప్రజలు వారి వారి ఇళ్లలోనే ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. గాలి, వర్షాలకు తెగి నేలపై పడిన విద్యుత్ వైర్లను చేతితో తాకవద్దన్నారు. ఈత కోసం వాగులు, గోదావరి, చెరువుల్లోకి దిగవద్దని హెచ్చరించారు.

నియామకం



మొగుళ్లపల్లి: ముల్కలపల్లి గ్రామ యునైటెడ్ ఫోరం ఫర్ సమాచార హక్కు చట్టం గ్రామ కన్వీనర్‌గా నేరేళ్ల దేవేందర్‌ను నియమించినట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు కమలాపురం విజేందర్ మంగళవారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన మండల శాఖ అధ్యక్షుడికి, జిల్లా కమిటీకి దేవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

బెల్టుషాపులపై దాడి

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పెగడపల్లి, మాదారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.10వేల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెల్లడించారు.

శ్రీగంధం, టేకు చెట్లు దగ్ధం



రేగొండ: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని శ్రీగంధం, టేకు చెట్లు దగ్ధమైన సంఘటన మండలంలోని మడ్తపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. కందకట్ల భిక్షపతి ఐదు ఎకరాల్లో రెండేళ్లుగా శ్రీగంధం, సర్వి, టేకు చెట్లను సాగు చేస్తున్నాడు. కాగా తన చేను పక్కనే ఉన్న ఓ రైతు చెత్త తగలబెట్టగా మంటలు బాధిత రైతు చేనులోకి వ్యాపించాయి. దీంతో నాలుగు ఎకరాల్లోని శ్రీగంధం, సర్వి, టేకు చెట్లతో పాటు డ్రిప్ పైపులు కాలి పోయాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.40 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరాడు.

బాలుడి తలపై పడ్డ జాకీరాడ్

- పరిస్థితి విషమం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన ఎండీ సాబీర్(15) అనే బాలుడి తలపై జాకీరాడ్ పడి తీవ్ర గాయమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరి సమీపంలోని ఓ కిరాణ దుకాణం వద్దకు బాలుడు మంగళవారం వెళ్లాడు. అదే సమయంలో ఒక్కసారిగా గాలిదుమారం రావడంతో పైఅంతస్తు మీద నుంచి జాకీరాడ్(ఇనుపకడ్డీ) బాలుడి తలపై పడింది. దీంతో తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. కుటుంబ సభ్యులు మహదేవపూర్ ఆస్పత్రికి తరలించడంతో బాలుడు అప్పటికే వాంతులు చేసుకుంటుండగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెక్కాడితేకాని డొక్కాడని నిరుపేదకుటుంబం కావడంతో ముస్లిం యూత్ ఆధ్వర్యంలో సాయం చేయాలని గ్రామంలో వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో హాస్టల్ వర్కర్ మృతి



ఏటూరు నాగారం: మండలంలోని ఐటీడీఏ పరిధిలోని చిన్నబోయినపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో గ్రేడెడ్ వర్కర్‌గా పనిచేస్తున్న చెరుకుల రవికుమార్(38) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏటూరునాగారం మండలంలోని ఎలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన చెరుకుల రవికుమార్ ఆశ్రమ పాఠశాలలో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో తన సొంత గ్రామమైన ఎలిశెట్టిపల్లిలో కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. పలు పనుల నిమిత్తం సోమవారం ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి వెళ్తుండగా 163 జాతీయ రహదారి హైవే వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి కావడంతో ఢీవాహనాన్ని ఎవరు గుర్తు పట్టలేదు. రవికుమార్‌కు భార్య సుమలత ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా ప్రస్తుం సుమలత గర్భవతి. సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



ఎస్ఎస్ తాడ్వాయి: పార్టీలో చేరిన నాయకులతో మంత్రి సీతక్క



మంగపేట: పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

- మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యకర్తలను కంటికి రెప్పాలా కాండుకుంటానని తెలిపారు. ఎంపీ అభ్యర్థిగా బలరాం నాయక్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో బీరెల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ నారాయణ-భవాని, ఉప సర్పంచ్ వంగారి సదానందం-అనుసూయ, పీఏసీఎస్ డైరెక్టర్ కాయితీ లింగాచారి, వార్డు సభ్యుడు బెజ్జూరి వెంకన్న, వంగారి సురేష్, సాంబయ్య, ఇర్సవడ్ల నాగమలయ్య, బసాని అనీల్, ముంద్రాతి బీమసేన, కాటాపూర్ గ్రామానికి చెందిన మాజీ మండల అధ్యక్షురాలు ముంద్రాతి రాజశ్రీ, శ్రీనివాస్, మద్దురి ఆదినారాయణ, అంకంపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ మంకిడి నర్సయ్య , మంకిడి నాగేశ్వర్‌రావు, ప్రశాంత్, పీఏసీఎస్ డైరెక్టర్ సుశీల, లచ్చిసమ్మయ్య, బీజేపీ నాయకుడు జయపాల్‌రెడ్డి ఉన్నారు.

మంగపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ తదితరులు మంత్రి సీతక్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బైక్ ర్యాలీ, ఎన్నికల ప్రచార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రుల సమక్షంలో చేరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాజీ జెడ్పీటీసీ వైకుంఠం, మాజీ ఎంపీపీ పచ్చా శేషగిరిరావు, మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ నర్రా శ్రీధర్, ఆదినారాయణ, మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ సత్యనారాయణ కాంగ్రెస్‌లో చేరారు.

వెంకటాపురం(కె): బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి పిల్లారి శెట్టి మురళి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వాజేడు మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎమ్మెల్యే వీరయ్య ఎన్నికల ప్రచారానికి రాగా వారి సమక్షంలో పార్టీలో చేరారు.

కేంద్రంలో బీజేపీని గద్దె దించాలి



పస్రాలో మాట్లాడుతున్న నాయకులు



వెంకటాపురం(కె): ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ

గోవిందరావుపేట: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ మేనేజ్‌మెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ కత్తి వెంకటస్వామి పిలుపునిచ్చారు. మండల పరిదిలోని పస్రా గ్రామంలో సీపీఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. దేశంలో పది సంవత్సరాలుగా కేంద్రంలో అరాచక పాలన కొనసాగుతుందన్నారు. మోదీ పేదలపై పెనుభారాలు మోపుతూ రైతులపై నల్ల చట్టాలు తెచ్చి వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ నిధులు తగ్గించినట్లు తెలిపారు. నిరుద్యోగాన్ని పెంచి ప్రభుత్వ రంగ సంస్థల్ని అప్పనంగా ప్రైవేట్ వారికి అప్పగించి బీజేపీ ప్రభుత్వం అంబానీ ఆదానిలకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, పాదిలి చిట్టిబాబు, మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ సభ్యులు సూరపనేని నాగేశ్వరరావు, మండల నాయకులు గుండు రామస్వామి, అంబాల మురళి, కడారి నాగరాజు, క్యాతం సూర్యనారయణ, ముమ్మడి ఉపేంద్ర చారి, పిట్టల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బలరాం నాయక్‌ను గెలిపించండి

వెంకటాపురం(కె): కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను గెలిపించాలని మంగళవారం నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉపాధిహామీ పనులు జరిగే ప్రాంతానికి వెళ్లి చేతిగుర్తుకు ఓటువేసి బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ పాయం రమణ, నాయకులు బాలసాని శ్రీను, మద్దుకూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం అందరి బాధ్యత



ఓటు వేసిన పోలీసులు

గోవిందరావుపేట: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిబ్బందితో కలిసి ఎస్సై కమలాకర్ మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలందరూ ఓటు హక్కును స్వేచ్ఛగా, ఎలాంటి భయ భ్రాంతులకు, ప్రలోభాలకు గురి కాకుండా వినియోగించుకోవాలన్నారు. దేశ భవిష్యత్ ప్రజలు వేసే ఓటు మీద ఆధారపడి ఉంటుందని అన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కమలాకర్

మంగపేట: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్సై అచ్చ కమలాకర్ మంగళవారం పరిశీలించారు. జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా మచ్చాపూర్, చల్వాయి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

నలుగురి బైండోవర్

మండలంలోని ప్రాజెక్టునగర్ గ్రామానికి చెందిన గొారబోయిన రంజిత్, ఊకే సతీష్, కోటి శ్రీకాంత్, వాసం అరవింద్‌లను మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై అచ్చె శ్రీకాంత్ తెలిపారు. వన్య ప్రాణుల కోసం విద్యుత్ తీగలు అమర్చే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న లక్ష్మణ్‌రావు

మంగపేట: మండలంలోని మల్లూరులో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకుల మోసపూరిత మాటలను నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, జిల్లా నాయకులు తాటి కృష్ణ, చిన్నాల చక్రాదర్‌రావు, మల్లూరు హేమాచల క్షేత్రం మాజీ చైర్మన్ నూతులకంటి ముంకుందం, దంతెనపల్లి నరేందర్, చిలకమర్రి రాజేందర్, అల్లె జనార్దన్, కోరెం నర్సింహారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాముడి పేరుతో రాజకీయం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రేగొండ: దేశంలో మత తారతమ్యాలు లేకుండా కలిసి ఉంటున్న ప్రజల మధ్య రాముడి పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టేలా బీజేపీ ప్రభుత్వం రాజకీయం చేయడం సరికాదని పీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాజర్ల అశోక్, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు బందు సాయిలు, కొరివి రాజుకుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో పదేళ్ల బీజేపీ పాలనలో పేద ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. బీజేపీ పాలనలో దేశ ఆర్థిక పరిస్థితులు దిగజారిపోయాయని ఆరోపించారు. జీఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేకల భిక్షపతి, మైస భిక్షపతి, గునిగంటి రమేష్, గండి తిరుపతి సీపీఐ, సీపీఎం నాయకులు దేవెందర్, పెంట రవి తదితరులు పాల్గొన్నారు.

జోరువానలో బీటీ రోడ్డు నిర్మాణం

- ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ శూన్యం



వర్షంలో వేస్తున్న బీటీ రోడ్డు

మంగపేట: మండలకేంద్రం పరిధిలోని గౌరారం వాగు బ్రిడ్జి నుంచి బోరునర్సాపురం వరకు ఏటూరు నాగారం-బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై బీటీ రెన్యువల్ పనులను జోరువానలో చేయడం ఏంటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పనులు జరుగుతుంటే దగ్గర ఉండి పర్యవేక్షించాల్సిన అధికారుల్లో లేకపోవడం గమనార్హం. జోరుగా వర్షం పడుతున్నా బీటీ వేస్తుండటంతో స్థానికులు ఆశ్చర్యపోయారు. కొందరు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ వర్షంలో బీటీ ఎలా వేస్తారని ఇంత నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించగా పనులు నిలిపినట్లు నిలిపి మళ్లీ బీటీ వేశారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరీపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే విధంగా చుంచుపల్లి, కమలాపురం, బ్రాహ్మణపల్లి వద్ద రోడ్డుపై డస్ట్ తొలిగించ కుండా బీటీ వేయడంతో వేసిన కొద్ది రోజులకే లేచి పోయింది. ఈ విషయంపై సంబంధిత ఆర్అండ్‌బీ డీఈ రఘువీర్‌ను వివరణ అడుగగా వేస్తే ఏమవుతుంది ఒక వేల లేచిపోతే కాంట్రాక్టర్ మళ్లీ వేస్తాడుగా అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం.

బాలల హక్కులకు భంగం కలిగించొద్దు



అవగాహన కల్పిస్తున్న బాలల అధికారులు

భూపాలపల్లి రూరల్: బాలల హక్కులకు భంగం కలిగించొద్దని చైల్డ్ హెల్ప్ లైన్ కేర్ వర్కర్ కళావతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పలు కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో బాలల రక్షణ, పరిరక్షణ కోసం జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్-1098 అందిస్తున్న సేవలపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం, బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడడం, అక్రమ దత్తతలు, బాలలను హింసించడం వల్ల ఎదురయ్యే చట్ట పరమైన శిక్షల గురించి వివరించారు. బాలల సమస్యలను చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలలరక్షణ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత గడ్డిమందు పట్టివేత

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం అంతర్‌రాష్ట్ర వంతెన బార్డర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా మహారాష్ట్రలోని సిరొంచ తాలూకా పోచంపల్లికి చెందిన చల్ల మహేష్ నిషేధిత గడిమందు తరలిస్తుండగా మంగళవారం పట్టుకున్నారు. పట్టుబడిన గడ్డిమందు 70లీటర్ల వరకు ఉంటుంది. నిషేధిత గడ్డిమందును మహదేవపూర్ ప్రాంతాల్లో విక్రయించడానికి తరలిస్తున్నారని తెలిపారు. నిషేధిత గడ్డిమందు తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్సై భవానిసేన్ తెలిపారు.

అటవీ జంతువులను వేటాడితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహాముత్తారం: విద్యుత్ ఉచ్చులతో అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేందర్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బోర్లగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్ద అటవీశాఖ అధికారులతో కలిసి కూలీలకు, గ్రామస్తులకు అటవీ జంతువులను వేటాడొద్దని అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా ఉచ్చుతో కానీ కరెంట్ వైర్లతో వేటాడితే తమకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులతోపాటు పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వామ్మో.. భావుసింగ్‌పల్లి రోడ్డు!

- భయపడుతున్న వాహనదారులు
- కొట్టుకుపోయిన రోడ్లు, లోలెవల్ కల్వర్టు
- మూడేళ్ల నుంచి ఇదే దుస్థితి..



ప్రమాదకరంగా ఉన్న తొల్లమడుగు కల్వర్టు

చిట్యాల : మండలంలోని భావుసింగ్‌పల్లి గ్రామానికి వెళ్లే మూడు వైపులుగా ఉన్న రోడ్లు మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. అలాగే కల్వర్టు గండ్లు పడి తెగిపోయాయి. ఈ రోడ్లను చూస్తే వాహనదారులు భయపడుతున్నారు. జడల్‌పేట నుంచి భావుసింగ్‌పల్లికి వెళ్లే రహదారికి ఇరువైపులా గండ్లు పడి మట్టి కొట్టుకపోయింది. ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి. అలాగే భావుసింగ్‌పల్లి నుంచి ఎస్సీ కాలనీ, కొత్తపేట వైపు వెళ్లే దారిలో ఉన్నటువంటి తోళ్ల మడుగుపై నిర్మించిన లోలెవల్ కల్వర్టు వరద తాకిడికి కొట్టుకుపోయింది. ముచినిపర్తికి వెళ్లే దారి కొట్టుకు పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు నిత్యం భూపాలపల్లి, పరకాలకు వెళ్లేందుకు పలు వాహనాలపై ఇదే రోడ్డుగుండా ప్రయాణిస్తుంటారు. కొట్టుకుపోయిన రోడ్లకు, కల్వర్టుకు కనీసం మరమ్మతులు కూడా చేయలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఈ రోడ్లు కనబడటం లేదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు, కల్వర్టు నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



తొల్లమడుగు కల్వర్టు తెగి ఇప్పటి వరకు సంవత్సరాలు గడుస్తున్న ఈ కల్వర్టును కనీసం ఎవరు పట్టించుకోలేదు. నాయకులు ఓట్లు కావాలని అడుగుతున్నారే తప్ప సమస్యలను పరిష్కరించడం లేదు. వెంటనే అధికారులు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

\- పసుపుల సురేందర్, గ్రామస్తుడు

కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్హర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మండలంలోని తాడిచర్లలోని చెరువుల వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్ద మంగళవారం ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్, తాజోద్దీన్, యాదగిరిరావు, రాజేశ్వర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే పేదల అభివృద్ధి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

చిట్యాల: బీఆర్ఎస్ పార్టీతోనే పేదలకు అభివృద్ధి జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జడలపేట, నైన్‌పాక, వరికోల్‌పల్లి, చైన్‌పాక, అందుకు తండా, వెంచరామి గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపిలించాలని కోరారు. అలాగే జడలపేటలో ఉపాధీహామీ కూలీల వద్దకు ప్రచారం నిర్వహించారు. అనంతరం అందుకుతండాలో ఉయ్యాల శివరాజం అనే వ్యక్తి మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సాగర్, క్రాంతి కుమార్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



టేకుమట్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో విస్తృతంగా వాహనాల తనిఖీ చేశారు. ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.